# అధ్యాపకులే అసలైన నాయకులు

**నేటి విద్యలు పొట్టకూటికోసమెగాని,**
**ధర్మధార్మిక విద్య తెలుపలేవు**
**ఇట్టి విద్యలు నేర్చి ఏమి ఫలము?**
**వినుడు భారతీయ వీర సుతుడ!**

ఈనాడు శ్రీకాకుళంనుండి ఇంతమంది అధ్యాపకులు రావడం చాలా సంతోషం. శ్రీకాకుళం అనగా 'శ్రీ'తో చేరినటువంటి కులము. శ్రీరామునికి, శ్రీకృష్ణునికి, శ్రీరామకృష్ణ పరమహంసకు ముందు 'శ్రీకారం' ఉన్నట్లే మీ జిల్లాకుకూడా శ్రీకారం ముందు ఉంది. శ్రీకాకుళం నుండి వచ్చినటువంటివారు మహా భక్తులు. ఇప్పుడే కాదు, మొదటినుండికూడను వారు పరమ భక్తులే! ఏ మాట విన్నా, ఏ పలుకు పలికినా, ఏ తలపు తలచినా అందరూ భగవత్తత్త్వమునే అనుభవిస్తూ ఆనందిస్తున్నారు.

దేశముయొక్క అభివృద్ధి పిల్లల ప్రవర్తనపైననే ఆధారపడియున్నది. దేశము సౌభాగ్యముతో విలసిల్లవలెనన్న పిల్లలయొక్క భావములు, చర్యలు ఎంతో సున్నితంగా, పవిత్రంగా ఉండాలి. అట్టి పిల్లలను తయారు చేసేటటువంటి అధ్యాపకులైన మీరు చాలా అదృష్టవంతులు. ఆదర్శప్రాయులైన అధ్యాపకుల వల్లనే దేశము పురోభివృద్ధి గాంచుతుంది. అధ్యాపకులు సరియైనటువంటి వారైనప్పుడే పిల్లలు సరియైన స్థితికి వస్తారు. అధ్యాపకులు పవిత్రమైన భావముతో పవిత్రమైన పలుకులు పలికితే పిల్లలలోకూడా పవిత్రమైన, సున్నితమైన, ఉన్నతమైన భావాలు ప్రవేశిస్తాయి.

**ప్రేమ, త్యాగములవల్లనే సకల సౌఖ్యములు లభిస్తాయి**

ప్రేమస్వరూపులారా! మీరు పిల్లలకు బోధించవలసినది కేవలం లౌకికమైన, భౌతికమైన

sri sathyasaivachanamrutam

విద్య కాదు; దీనితోపాటు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విషయములను కూడా బోధించాలి. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. ఆత్మవిశ్వాసము లేనివారికి ఎన్ని ఉండినప్పటికీ ప్రయోజనము లేదు. ముఖ్యంగా మీరు పిల్లలలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించాలి. ఆధ్యాత్మికమనగా దైవచింతన. పిల్లల హృదయాలలో దైవచింతనను అభివృద్ధిపరచినప్పుడే వారి భావములు నిర్మలమై, నిశ్చలమై, నిస్వార్థమై ప్రవహిస్తాయి. ఈనాడు లోకములో ఎక్కడ చూసినను అందరూ ధనముకోసమే ప్రాకులాడుతున్నారు. ధనము ఏమి చేస్తుందాది మనకు? కంటి నీరేమైనా తుడుస్తున్నదా? లేదు. ధనమువల్ల కలిగే సుఖమేమీ లేదు. ధర్మమువల్ల, త్యాగమువల్ల, ప్రేమవల్లనే మనకు సకల సౌఖ్యములు లభ్యమవుతాయి. ధర్మము ఎక్కడినుండి వచ్చింది? 'సత్యాన్నాస్తి పరో ధర్మః' సత్యము లేక ధర్మము లేదు. కాబట్టి, సత్యధర్మములను ఆధారంగా తీసికొని మన జీవితమును గడపాలి. ఈ లోకంలో మనము పుట్టినది ఎందుకోసం? కేవలం తినడానికి, తిరగడానికి, నిద్రించడానికి కాదు. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః', 'నా అంశమే మీ అందరియందున్నది', అని చెప్పాడు, కృష్ణుడు. కాబట్టి, మీరందరుకూడను దైవస్వరూపులే! ప్రేమస్వభావులే! ఇట్టి పవిత్రమైన మానవజన్మ ఎత్తినందుకు మీరు పవిత్రమైన భావములతో, పవిత్రమైన చర్యలతో జీవితాన్ని గడపాలి. అప్పుడే దేశము బాగుపడుతుంది. హృదయ పవిత్రత లేకుండా మీరు ఎన్ని యజ్ఞములు, ఎన్ని యాగములు, ఎన్ని తపములు చేసినప్పటికీ అన్నీ బూడిదలో పోసిన పన్నీరువలె వ్యర్థమైపోతాయి. పిల్లల హృదయాలు చాలా స్వచ్ఛమైనవి, పవిత్రమైనవి. అట్టి హృదయాలలో మీరు ప్రేమబీజములు నాటండి. అవి మహావృక్షములుగా పెరిగి ధర్మము, శాంతి అనే మధురమైన ఫలములను మీకు అందిస్తాయి. పిల్లలు ఉన్నతస్థితిని చేరుకొనవలెనన్న, వారి భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దవలెనన్న వారికి మీరు మంచి బుద్ధులు నేర్పాలి. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలను నేర్పినప్పుడు పిల్లలు బుద్ధిమంతులై దేశాన్ని చక్కదిద్దగలరు. కేవలం దేశాన్నే కాదు, యావత్ ప్రపంచాన్నే చక్కదిద్దగలరు. పిల్లలకు కఠినమైన పదములను ఏమాత్రము నేర్పకూడదు. సున్నితమైన భావములను, మృదుమధురమైన పలుకులను వారికి నేర్పించాలి. ప్రేమమయమైన జీవితమును

sri sathyasai vahini amrutam

అందించాలి. పిల్లలను సదాచార సంపన్నులుగా తీర్చిదిద్దినప్పుడు ఈ జగత్తు సదా దేదీప్యమానంగా వెలుగొందుతుంది. సదాచార సంపన్నులైన పిల్లలు దీపాలవలె చీకటిని పారద్రోలి దేశాన్ని ప్రకాశవంతం గావించగలరు.

**స్వామి ప్రేమచేత సర్వచింతలూ పరిహారమవుతాయి**

ఈనాటి మానవుణ్ణి అనేక రకములైన చింతలు పట్టి పీడిస్తున్నవి.

**పుట్టుట ఒక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టములొక చింత**
**సంతస మొక చింత వింత చింత!**
**సర్వచింతలు బాపెడి శ్రీస్వామి భక్తిని**
**గొనుడు ఇకనైన ప్రజలార ప్రేమమీర!**

స్వామి ప్రేమచేత సర్వచింతలుకూడను పరిహారమైపోతాయి. 'మెయిన్ స్విచ్' 'ఆన్'లో ఉన్నప్పుడు అన్ని బల్బులూ వెలుగుతాయి. భక్తి అనేది 'మెయిన్ స్విచ్' వంటిది. ఇది 'ఆన్'లో ఉన్నప్పుడు అన్ని దేశములనూ ప్రకాశింపజేస్తుంది; పవిత్రం గావిస్తుంది. భక్తి అంటే భజన చేయడం, తాళాలు కొట్టడం కాదు. భక్తి అంటే భగవంతునిపట్ల ప్రేమ, ప్రేమ, ప్రేమ! ఆ ప్రేమను మీరు పెంచుకున్నప్పుడు సర్వము పవిత్రమవుతుంది. జీవితము ప్రేమమయమైనది. మనము పుట్టినదే ప్రేమనుండి. ప్రేమతో పుట్టినాము, ప్రేమతోనే జీవించాలి, ప్రేమతోనే మరణించాలి. అంతేగాని, అనేకరకములైన చింతలు పెట్టుకుంటే మనము బ్రతకలేము. చింతలకు చోటివ్వకూడదు, సంతోషమునకే మీరు చోటివ్వాలి.

అధ్యాపకులారా! మీకు నష్టమైనా, కష్టమైనా, బాధ కలిగినా సహించుకొని, భరించుకొని పిల్లలకు మంచిని నేర్పడానికి తగినటువంటి కృషి చేయాలి. అది మీ ప్రధాన కర్తవ్యము.

srisathyasaivachanamrutam

రాజకీయ నాయకులు కాదు, అధ్యాపకులే దేశమునకంతటికీ నిజమైన నాయకులు. మీరే పిల్లలను చక్కదిద్దగలరు. అధ్యాపకులే లేకపోతే అరాచకము ప్రబలిపోతుంది. అధ్యాపకులు తగిన శ్రద్ధ వహించి, పిల్లలను ఆదర్శజ్యోతులుగా తీర్చిదిద్ది, పల్లెపల్లెయందు, వీధివీధియందు ఆ ప్రకాశమును ప్రసరింపజేసి, ప్రజలకు ఆనందాన్ని అందించాలి. ప్రజలు అనేకరకములైన బాధలతో సతమతమవుతున్నారు. పవిత్రమైన భగవన్నామ స్మరణను వారికి బోధించి, వారి బాధలను నివారించడానికి ప్రయత్నించాలి. వారు ఎన్ని బాధలలో ఉండినప్పటికీ పవిత్రమైన భగవన్నామము వారి చెవికి సోకిన తక్షణమే వారి హృదయంలో ఆనందం తాండవిస్తుంది.

అధ్యాపకులారా! మీరెంతో అదృష్టవంతులు. మీకు చిక్కిన ఈ అదృష్టాన్ని మీరు నిల్పుకోవాలి. ఈ అదృష్టాన్ని మీరు పెంచుకోవాలి, పోషించుకోవాలి. ఈ అదృష్టాన్ని పదిమందికి పంచాలి. ఆవిధంగా పంచడంద్వారా పండిన ఆనందమనే పంటను మీరు భుజించాలి. అధ్యాపక వృత్తి చాలా ఉత్తమమైనది. అధ్యాపకులు జగత్తునకే నాయకులు. వారు లేకపోతే ఈ జగత్తే లేదు. వసిష్ఠ, విశ్వామిత్రులు, జమదగ్ని ఇలాంటి మహర్షులంతా ఎంత గొప్పవారు! ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, భీష్మాచార్యుడు ... వీళ్ళంతా ఆచరణపూర్వకంగా లోకానికి ఆదర్శాన్ని అందించినటువంటివారు. వీరే నిజమైన ఆచార్యులు. ఇటువంటి ఆచార్యులుగా మీరు రూపొందినప్పుడే లోకములోని అనాచారమునంతా దూరం చేయగలరు. కౌరవ, పాండవులు తమ బాల్యంలో ఒక పర్యాయం బంతితో ఆడుకుంటూ ఉండగా ఆ బంతి అక్కడున్న బావిలో పడిపోయింది. ఆ సమయంలో ద్రోణుడు తన భార్యా కుమారులతో కలిసి ఎక్కడికో ప్రయాణమై వెళుతూ అటువైపు వచ్చాడు. బావి చుట్టూ చేరిన ఆ పిల్లలవద్దకు వచ్చి, 'ఎందుకు మీరీవిధంగా బావిచుట్టూ గుమికూడారు? ఏమి జరిగింది?' అని అడిగాడు. 'మా బంతి ఈ బావిలో పడిపోయింది, స్వామీ!' అన్నారా పిల్లలు. 'మీరేమీ విచారించకండి. దానిని నేను బయటికి తీస్తాను', అని పలికి ద్రోణుడు ఒక అంబును ప్రయోగించగా అది వెళ్ళి బంతికి గ్రుచ్చుకుంది. ఆ బాణానికి గ్రుచ్చుకునేలాగున మరొక బాణమును ప్రయోగించాడు. ఈవిధంగా బాణాలను ఒకదాని కొకటి 'జాయిన్' చేసి, బాణరజ్జువును రూపొందించి దానితో ఆ బంతిని బయటికి తీశాడు.

sri sathyasai vachanamrutam

ఈరీతిగా అధ్యాపకులు పిల్లలలో యుక్తిని, శక్తిని అభివృద్ధి పరచాలి. పిల్లలకు చక్కని ఆదర్శాలను బోధించాలి. అప్పుడే పిల్లలు అభివృద్ధికి వస్తారు, ఆనందాన్ని అనుభవిస్తారు. వారి ఆనందమే జగత్తునకు ఆహారము. పిల్లలకు ఆనందము లేకపోతే ఆహారము ఉండి ఏమి ప్రయోజనము? మానవ జీవితం ఎంతో ఉన్నతమైనది, ఉత్కృష్టమైనది. అందుకు తగినట్లుగా మనం పవిత్ర మైన భావాలతో మన హృదయాన్ని నింపుకోవాలి. అధ్యాపకులైన మీరు మొట్టమొదట సదభ్యాసములను అలవరచుకొని, ఆ తరువాత వాటిని పిల్లలకు బోధించండి. అధ్యాపకులే సిగరెట్లు కాలుస్తుంటే పిల్లలు మాత్రం ఊరుకుంటారా! అధ్యాపకులు సదాచారములను, సదభ్యాసములను పోషించుకున్నప్పుడే పిల్లలు సదాచారసంపన్నులుగా రూపొంది, దేశాభ్యుదయానికి పాటుపడగలరు. ఎన్ని కష్టము లెదురైనను వెనుకంజ వేయక అధ్యాపకులు పిల్లలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకోవాలి. అదే నిజమైన అధ్యాపకుని లక్షణము. ఇక్కడ మీరు నేర్చుకున్న మంచిని మీరు ముందు ఆచరణలో పెట్టి పిల్లలకు బోధించాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

**(తేదీ 05.12.2006, శ్రీకాకుళం జిల్లా అధ్యాపకుల పర్తియాత్ర, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasaivachanamrutam